సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



.. తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు మాత్రమేనని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. IIలో



మిగిలింది ఆరు రోజులే...

యాసంగి సాగు అవసరాల కోసం విడుదల చేస్తున్న నాగార్జునసాగర్ జలాలు మరో ఆరు రోజుల్లో నిలిచిపోనున్నాయి. IIలో

గరిష్టం / కనిష్టం 42° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పగటి పూట ఎండలు మండిపోతాయి.

నిగనిగలాడేలా పండు!



ఉమ్మడి ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటల్లో ప్రధానంగా మామిడి పంట విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. సత్తుపల్లి, అశ్వారావుపేట, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, అన్నపురెడ్డిపల్లి, ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ, తల్లాడ తదితర మండలాల్లో మామిడి సాగు చేస్తున్న రైతులు మేలైన, నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారు. వీరిలో స్థానికంగా విక్రయించే వారిని మినహాయిస్తే విదేశాలకు మామిడి ఎగుమతి చేయాలనుకునే రైతులు 'ఫ్రూట్ బ్యాగింగ్' విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ విధానంలో కాయపై ఎలాంటి మచ్చ పడకపోగా.. నిగనిగలాడేలా పండ్లు సిద్ధమవుతాయి. తద్వారా విదేశీ ఎగుమతులకు అనుకూలంగా మారి, మంచి ధర లభిస్తుందని రైతులకు ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. – ఖమ్మం డెస్క్

'ఫ్రూట్ బ్యాగింగ్'తో మస్త్‌మస్త్ మ్యాంగో

- నాణ్యమైన మామిడి ఉత్పత్తికి మేలైన మార్గం
- మంచి రంగు వస్తుండడంతో విదేశాల్లో అత్యధిక ధర
- అధికారుల అవగాహనతో ముందుకొస్తున్న రైతులు





అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడితోట (ఇన్‌సెట్) ఫ్రూట్ బ్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి మరియన్న

ఫ్రూట్ బ్యాగింగ్ విధానంలో ఒక్కో మామిడి కాయకు కవర్ అమర్చేందుకు రూ. 2 నుంచి రూ.3 ఖర్చు వస్తుంది. ఈ రకంగా చూస్తే టన్నుకు రూ.3 వేల నుంచి రూ. 4వేల వరకు ఖర్చవుతుంది. అయితే, మామిడికాయను సాధారణ పద్ధతిలో కోసి విక్రయిస్తే టన్నుకు నాణ్యత ఆధారంగా రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు ధర లభిస్తుంది. అదే ఫ్రూట్ బ్యాగింగ్ చేసి తొడిమలతో కోసి ఒకటి, రెండు రోజులు రైపనింగ్ చాంబర్‌లో మాగించాక దేశీయంగా విక్రయిస్తే టన్నుకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. ఇక విదేశాలకు ఎగుమతి చేస్తే టన్నుకు రూ.1.20 లక్షల నుంచి రూ. 1.50 లక్షల వరకు ఆదాయం వస్తుండడం విశేషం.

'అపెడా' అనుమతితో..

ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు ఎయిర్ కార్గో, సముద్ర మార్గాన మామిడి పండ్లను ప్రత్యేక ప్యాకింగ్‌లో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ నుంచి ఎక్కువగా దుబాయ్, ఖతర్, యూకే, యూరప్, లండన్, అమెరికా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇలా పండ్లు ఎగుమతి చేయాలనుకునే రైతులు అపెడా(అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

63,464 ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 15,949 మంది రైతులు 63,464 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఎకరాకు 4 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న విస్తీర్ణం ఆధారంగా 2,72,990 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఫ్రూట్ బ్యాగింగ్ విధానంలో ఎగుమతులకు అదనంగా టన్నుకు దూరాన్ని బట్టి రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు వస్తున్నా అదే స్థాయిలో ఆదాయం ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన దాదాపు 500 మంది రైతులతో పాటు కొందరు వ్యాపారులు అపెడా ద్వారా ఏటా 800 టన్నుల నుంచి 1,000 టన్నుల వరకు ఫ్రూట్ బ్యాగింగ్ పంట విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మరో 300 నుంచి 400 టన్నుల వరకు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

అమెరికాకు 30 టన్నుల ఎగుమతి



మా పూర్వీకుల నుంచి మామిడి సాగు చేస్తున్నాం. ప్రస్తుతం 40ఎకరాల తోట ఉంది. ఈ ఏడాది 120 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఎప్పుడూ పంటను స్థానికంగానే విక్రయిస్తాం. కానీ గతేడాది మూడు టన్నులకు ఫ్రూట్ బ్యాగింగ్ చేసి రాజస్తాన్‌కు ఎగుమతి చేస్తే మంచి ఫలితం వచ్చింది. ఈసారి 30 టన్నులకు ఫ్రూట్ బ్యాగింగ్ చేసి అమెరికా ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అక్కడ టన్నుకు రూ.1.30లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు ధర లభించే అవకాశం ఉంది. రవాణా ఖర్చు ఉన్నా ఆదాయం అదే స్థాయిలో వస్తుంది.

– వి.శ్రీధర్, ఎర్రగుంట, అన్నపురెడ్డిపల్లి మండలం

ఏమిటీ విధానం

మామిడిచెట్లపై కాయలు సహజసిద్ధంగానే పండుతాయి. లేదంటే కాయ పక్వానికి వచ్చాక తెంపి రకరకాల పద్ధతుల్లో పండించి విక్రయిస్తారు. ఈ క్రమంలో కాయను పండు ఈగ, బూజు, మంగు ఇతరత్రా తెగుళ్లు ఆశించి నాణ్యత దెబ్బతింటోంది. కాయపై మచ్చలు ఏర్పడడంతో స్థానిక మార్కెట్‌లో మాత్రమే విక్రయించడానికి అనువుగా ఉంటోంది. అయితే, ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు సాగు చేస్తున్న మేలైన రకాలకు మన దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ డిమాండ్ ఉండడంతో ఎగుమతి చేయాలని భావిస్తున్నా పెద్దగా ధర లభించడం లేదు. ఈ నేపథ్యాన 'ఫ్రూట్ బ్యాగింగ్' విధానం అమల్లోకి వచ్చింది. కాగితపు లేదా ప్లాస్టిక్ కవర్లు ఒక్కో కాయకు చుడతారు. తద్వారా కాయలపై ఎలాంటి మచ్చలు, తెగుళ్లు ఏర్పడవు. ఒకవేళ కాయ కింద పడినా దెబ్బ ప్రభావం అంతగా ఉండదు. ఇక కాయ నిగనిగలాడుతూ ఉండడంతో విదేశాల్లో మంచి డిమాండ్, ధర పలుకుతోంది.



కాయలకు కవర్లు తొడుగుతున్న రైతులు

అన్ని రకాలుగా రైతులకు ప్రయోజనం



ఫ్రూట్ బ్యాగింగ్ విధానం అవలంబిస్తే రైతులకు ఎంతో మేలు. కాయలకు రక్షణ లభించడమే కాక తెగుళ్లు ఆశించవు. పండు రాలినా దెబ్బతినదు. నాణ్యత, రంగు బాగుండడంతో విదేశాలకు ఎగుమతి సులువవుతుంది. స్థానిక ధరతో పోలిస్తే నాలుగైదు రెట్లు ఎక్కువగా లభిస్తుంది. కొంత కాలంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు విదేశీ ఎగుమతులకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యాన ఈ విధానం మరింత మేలు చేస్తుంది.

– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్. పక్కన అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తదితరులు

జయంతి వేడుకల్లో ఎస్పీ, అదనపు కలెక్టర్

కొత్తగూడెంరూరల్ : అంటరానితనంతో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా అవమానాలనే ఆయుధంగా మలుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన బాబాసాహెబ్ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లుతో కలిసి ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వినీత్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే కారణమని చెప్పారు. అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చదువే మార్పునకు మూలమని, అందరూ చదువుకోవాలని అంబేడ్కర్ ఆకాంక్షించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ సబ్బారావు మధుసూదన్‌రాజు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు శివ, భాస్కర్, లక్ష్మణ్‌రావు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావుతో పాటు కూసపాటి శ్రీను, మద్దెల శివకుమార్, కొప్పరి నవతన్, కూరపాటి రవీందర్, కోటా శివశంకర్, నక్కా సృజన, పుష్పలత, దాసరి శ్రీను, పరమేష్, కనుకుంట్ల శ్రీను, భూపతి అప్పారావు పాల్గొన్నారు.

చరిత్రలో అంబేడ్కర్ పేరు పదిలం..

భద్రాచలంఅర్బన్ : రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ పేరు చరిత్ర ఉన్నంతకాలం పదిలంగా ఉంటుందని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక సాధికారత కోసం జీవితాంతం తపించిన మహనీయుడు అంబేడ్కర్ అని నివాళులర్పించారు. కుల, మత రహిత ఆధునిక భారతదేశం కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ రమాదేవి, ఈఈ తానాజీ, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఎస్‌ఓ సురేష్ బాబు, ఏసీఎం రమణయ్యతో అధికారులు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ముందుగా అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన గావించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి, చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం సా॥) 6.31

సహర్ (ఆదివారం ఉ॥) 4.29

పుస్తకాలొస్తున్నాయ్..

- పాఠశాలల ప్రారంభానికి ముందే అందుబాటులోకి..
- మే మూడో వారంలో పంపిణీ
- నూతన పుస్తకాలతోనే బడులకు



జూలూరుపాడు బుక్‌డిపోలో పుస్తకాలు భద్రపరుస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులు నూతన పాఠ్య పుస్తకాలతో పాఠశాలలకు రావాలనే లక్ష్యంతో ఈ ఏడాది ముందస్తుగానే పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు జూలూరుపాడులోని బుక్ డిపోకు ఇప్పటికే పలు పుస్తకాలు వచ్చాయి. పూర్తి స్థాయిలో రాగానే మే మూడో వారంలో విద్యార్థులకు పంపిణీ చేసేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతేడాది పాఠశాలలు ప్రారంభమయ్యాక మూడు నెలల వరకు కూడా కొన్ని పుస్తకాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. 1 నుంచి పదో తరగతి, ఇంటర్ పుస్తకాలు కూడా అరకొరగానే వచ్చాయి. దీంతో పాత పుస్తకాలతోనే చదువుకోవాల్సి వచ్చింది. ఇక గతేడాది 1 నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన అమలు కావడంతో అడ్మిషన్లు భారీగా పెరిగాయి. కొత్త విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదు కాకపోవడంతో వారికి పుస్తకాలు అందించలేకపోయారు. ఈ సంవత్సరం అలాంటి ఇబ్బందులు ఏమీ తలెత్తకుండా విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందేలా చర్యలు చేపట్టినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాకు చేరిన 1,85,135 పుస్తకాలు..

జిల్లాకు ఇప్పటివరకు 1,85,135 పుస్తకాలు వచ్చాయి. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఆంగ్ల భాషలో, తెలుగు మీడియం విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ రెండు భాషలు ఉండే బైలింగ్‌వెల్ పుస్తకాలను అందిస్తారు. అయితే రెండు భాషల్లో ఉండడం వల్ల పేజీల సంఖ్య పెరిగి పుస్తకాలు అధిక బరువు ఉండకుండా రెండుగా విభజిస్తున్నారు. అక్టోబర్ వరకు బోధించే సిలబస్‌తో కూడిన పుస్తకాన్ని పార్ట్-1గా, ఆ తర్వాత సిలబస్ ఉండే పుస్తకాలను పార్ట్ -2గా విభజిస్తారు. ఇంగ్లిష్, తెలుగు మీడియం కలిపి జిల్లాకు 7,08,530 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇందులో పార్ట్-1కు సంబంధించి 5,69,950 పుస్తకాలు మొదటి దశలో రానున్నాయి.

రెండో విడత అక్టోబర్‌లో..

జిల్లాకు రావాల్సిన మొత్తం పుస్తకాలు 7,08,530 కాగా ఇందులోనే ఉర్దూ, ఇతర భాషల పుస్తకాలు 6,940 ఉన్నాయి. ఇక పార్ట్-1లో ఇంగ్లిష్ మీడియం అన్ని పుస్తకాలు, తెలుగు మీడియానికి సంబంధించి 5,69,950 పుస్తకాలు పోను, మిగిలిన 1,38,200 పుస్తకాలు రెండో దశలో అంటే అక్టోబర్‌లో జిల్లాకు రానున్నాయి. యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ పుస్తకాలను పంపించనున్నారు. మొదటి విడతలో 1,85,135 పుస్తకాలు ఇప్పటికే జిల్లాకు చేరుకోగా, మిగిలిన 3,84,020 పుస్తకాలు ఈ నెలఖారు వరకు వస్తాయి. ముందుగానే పుస్తకాలు రావడంతో విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాకు చేరుతున్నాయి..

విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులు నూతన పుస్తకాలతో పాఠశాలలకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందస్తుగా పాఠ్యపుస్తకాలు పంపిస్తోంది. జిల్లాకు ఇప్పటి వరకు 1,85,135 పుస్తకాలు చేరాయి. మే మూడో వారం నాటికి విద్యార్థులందరికీ పుస్తకాలు అందేలా చర్యలు చేపడతాం.

– సోమశేఖరశర్మ, డీఈఓ

న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఆళ్లపల్లిలో ఐదుగురికి కరోనా

గుండాల: రెండేళ్ల తర్వాత కరోనా మహమ్మారి ఏజెన్సీలో మళ్లీ కలకలం రేపుతోంది. ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మండల కేంద్రానికి చెందిన ఒకరు, తునికిబండల, రామానుజగూడెం, సుద్దరేవు, కాచనపల్లి సబ్ సెంటర్ పరిధిలో ఒక్కొక్కరు చొప్పున కరోనా బారిన పడ్డారు. బాధితులు జాగ్రత్తలు పాటిస్తూ సక్రమంగా మందులు వాడాలని పీహెచ్‌సీ డాక్టర్ సంఘమిత్ర తెలిపారు.

సంపన్నులకే మోదీ సేవలు



చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

చర్ల: ప్రధాని నరేంద్రమోదీ సేవలు సంపన్నుల కోసమేనని, పేద, మధ్య తరగతి ప్రజలను ఆయన విస్మరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర నాయకులు కె. శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ సీపీఐ పేరిట చేపట్టిన జన చైతన్య యాత్రను శుక్రవారం ఆయన చర్లలో ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని సరైన రీతిలో గౌరవించడం తెలియని వ్యక్తులు, సంస్థలతో దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛను ప్రసాదించిందని, ప్రస్తుత పాలకులు ఆ స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ యాత్ర సాగుతుందని తెలిపారు. అనంతరం చర్ల మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. యాత్రకు సీపీఎం నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, యలమంచిలి రవికుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, బొల్లోజు అయోధ్య, నాయకులు కల్లూరి వెంకటేశ్వరావు, మిరియాల రంగయ్య, సారయ్య, ముత్యాల విశ్వనాథం, ఏపూరి బ్రహ్మం, రావులపల్లి రవికుమార్, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణ, బందెల నర్సయ్య, రేసు ఎల్లయ్య, ఆకోజు సునీల్‌కుమార్, శంకర్, నూపా పోతయ్య, కొంగూరు రాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

భద్రాచలంఅర్బన్‌: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని కాంట్రాక్టు ఉపాధ్యాయుల కృతజ్ఞతసభకు ఆయన హాజరై ప్రసంగించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలు ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డితోపాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌, బీరెల్లి కమలాకర్‌రావు, డి.వెంకటేశ్వర్లు, బానోతు రఘు, బి.నాగులు, దేవిసింగ్‌, పూణే నరసయ్య, బి.సైదులు, నిమానాయక్‌, పి.శ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు.

సీతాకుమారికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సీతాకుమారి

జూలూరుపాడు: మండలంలోని రామచంద్రాపురానికి చెందిన దిశ ప్రొటెక్షన్‌ వెల్ఫేర్‌ రాష్ట్ర జాయింట్‌ సెక్రటరీ కొడెం సీతాకుమారి.. డాక్టర్‌ అంబేడ్కర్‌ స్మారక పురస్కారం అందుకున్నారు. అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా నల్లగొండలో సాహితీ పుడమి వేదిక బాధ్యులు శుక్రవారం ఆమెకు పురస్కారం అందజేసి సన్మానించారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.13,943

ఇంకా ఆరు రోజులే...

20వ తేదీ వరకు సాగుకు సాగర్‌ జలాలు

- ఇప్పటికే 44 టీఎంసీల్లో 30టీఎంసీల మేర వినియోగం
- ఇకనుంచి అత్యవసరమైతే తాగునీటి కోసం చెరువులకు..
- ఖమ్మం జిల్లాలో సాగర్‌ కాల్వలకు అనుసంధానంగా 350కి పైగా చెరువులు


సాగర్‌ ప్రధాన కాల్వ

ఖమ్మంఅర్బన్‌: యాసంగి సాగు అవసరాల కోసం ఖమ్మంజిల్లాకు విడుదల చేస్తున్న నాగార్జునసాగర్‌ జలాలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే వరి కోతలు జోరుగా సాగుతుండగా, మొక్కజొన్న తదితర పంటలకు కూడా చేతికొచ్చేశాయి. దీంతో ఈనెల 20వ తేదీ తర్వాత నీటి విడుదల నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు విడుదలయ్యాయి. జిల్లాలోని 17 మండలాల పరిధిలో సుమారు 2.54లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. యాసంగిలో 2.20లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు అంచనా. ఈ లెక్కల ప్రకారమే జలవనరులశాఖ అధికారులు నీరు విడుదల చేశారు.

అంతరాయంతో రైతుల ఇక్కట్లు

ఈ వేసవిలో సాగర్‌ జలాల విడుదలలో తీవ్రమైన అంతరాయం ఏర్పడగా చివరి ఆయకట్టుకు నీరు చేరకపోవడం, కొన్నిచోట్ల పంటలు ఎండిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. అక్కడక్కడా కార్యాలయాల వద్ద, రహదారులపై ఆందోళనలు చేపట్టగా ప్రజాప్రతినిధులకు చేదు అనుభవాలు కూడా ఎదురయ్యాయి. జిల్లాకు ఇన్‌ఫ్లో క్రమపద్ధతిలో రాకపోవడంతో సీజన్‌ ప్రారంభం నుండి పంట కాలం ముగిసే వరకు ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. సాగర్‌ డ్యాం నుండి మూడు జిల్లాల పరిధిలో అధికారుల నడుమ సమన్వయం లేకపోవడంతో ఈ ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనికి తోడు అనధికారిక ఆయకట్టు పెరగడం, మొదటి రైతులు ఎక్కువగా నీటిని వినియోగించుకోవడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరలేదు. జిల్లాలో సాగర్‌ నీటి డిమాండ్‌, ప్రజాప్రతినిధుల నుండి వస్తున్న ఒత్తిడిని అధిగమించడానికి హైదరాబాద్‌ నుండి ఉన్నతస్థాయి అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాల్సి వచ్చింది. ఇలా వారబందీ విధానంతో అనేక ఆటుపోట్లు నడుమ సాగర్‌ జలాల విడుదల కొనసాగగా ఈనెల20న నీటి విడుదల నిలిపివేయనున్నారు.

30 టీఎంసీల వినియోగం

సాగర్‌ నుంచి జిల్లాలో సాగు, తాగునీటి అవసరాల కోసం 44 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటివరకు అధికారిక లెక్కల ప్రకారం సుమారు 30 టీఎంసీల మేర వినియోగించున్నారు. ఇక సాగర్‌ కాల్వ పరిధిలోని మండలాల్లో తాగునీటి అవసరం ఏర్పడితే అనుసంధానంగా ఉన్న చెరువుల్లోకి నీరు విడుదల చేసే అవకాశముందని చెబుతున్నారు. ఇంకా సాగర్‌ ఎడమ కాల్వ పరిధిలో 14 టీఎంసీల మేర నీటిని వినియోగించుకునే వెసలుబాటు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

షెడ్యూల్‌ ముగిసినా పొడిగించాం..



సాగు అవసరాలకు జిల్లాలో ఈనెల 20న సాగర్‌ నీటిని నిలిపేస్తాం. సరఫరా షెడ్యూల్‌ ప్రకారం ఈనెల 5నే నిలుపుదల చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో రైతుల నుండి వచ్చిన విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్షం పాటు పొడిగించాం. ఇక వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చడానికి సాగర్‌ కాల్వల ద్వారా నీటిని అవసరం ఉన్నప్పుడు విడుదల చేస్తాం. జిల్లాకు కేటాయించిన జలాల్లో ఇప్పటికే 30 టీఎంసీలు వినియోగించుకోగా ఇంకా 14 టీఎంసీలు మిగిలి ఉన్నాయి

– శంకర్‌నాయక్‌, సీఈ, జల వనరుల శాఖ

17 మండలాల్లో 350కి పైగా చెరువులు

కాల్వల ద్వారా సాగర్‌ నీటి విడుదల నిలిపివేసినా జిల్లాలోని ఆయకట్టు పరిధి 17 మండలాల్లో 350కి పైగా చెరువుల్లోకి తాగునీటి అవసరాల కోసం నింపడానికి నిల్వలు సిద్ధంగా ఉంచుతున్నారు. ఆయా చెరువుల్లోనూ ఫుల్‌ ట్యాంక్‌ లెవల్‌ కాకుండా 30నుండి40 శాతం మేరకు నింపనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఫుల్‌ ట్యాంక్‌ లెవల్‌ మేర నీరు నింపితే, అకాల వర్షాలు కురిస్తే ఇబ్బంది ఎదురుకానున్నందున ఈ నిర్ణయానికి వచ్చారు. చెరువకులకు తోడు జిల్లాలోని ప్రధాన జలాశయాలైన వైరా, లంకాసాగర్‌ ప్రాజెక్టుల్లోకి కూడా నీరు వదలనున్నారు.

అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణలో మంత్రి

హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ సహా ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు హాజరయ్యారు. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ప్రభుత్వ విప్‌ రేగా కాంతారావుతో పాటు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మం మయూరిసెంటర్‌


అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మంత్రి కేటీఆర్‌తో మంత్రులు పువ్వాడ, సత్యవతి


నివాళులర్పిస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు, కేశవరావు


మంత్రి కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి


విగ్రహం వద్ద ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు, విప్‌ కాంతారావు

బీఆర్‌ఎస్‌కు బ్రహ్మయ్య రాజీనామా

ఆయన వెంటే ఎంపీపీ, ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా..


మాట్లాడుతున్న తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ, తదితరులు

అశ్వాపురం: డీసీసీబీ డైరెక్టర్‌ తుళ్లూరి బ్రహ్మయ్య బీఆర్‌ఎస్‌ పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీఆర్‌ఎస్‌ నుంచి సస్పెండ్‌ చేయడంతో ఆయన అనుచరుడిగా కొనసాగుతున్న తుళ్లూరి బ్రహ్మయ్య కూడా రాజీనామా ప్రకటించారు. ఆయన వెంటే ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్‌ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, జిల్లా, మండల పరిషత్‌ కో ఆప్షన్‌ సభ్యులు షరాద్దీన్‌,ఎస్‌కే.ఖధీర్‌ తదితరులు కూడా చేశారు. ఈమేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పొంగులేటి ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన వెంటే నడుస్తామని ప్రకటించారు. 1988లో టీడీపీలో చేరిన బ్రహ్మయ్య అశ్వాపురం ఎంపీపీగా, జెడ్పీటీసీగా, పీఏసీఎస్‌ అధ్యక్షుడిగా, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌గా పదవులు చేపట్టారు. గతంలో టీడీపీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. టీడీపీలో ఉన్నప్పుడు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంట నడిచిన ఆయన 2013లో డీసీసీబీ చైర్మన్‌ పదవి దక్కకపోవడంతో నామా నాగేశ్వరరావు వెంట నడుస్తూ 2019లో టీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. డీసీసీబీ చైర్మన్‌ రేసులో ప్రధానంగా బ్రహ్మయ్య పేరు ఉన్నా, చివరి నిమిషంలో పదవి దక్కలేదు. అనంతరం నామాతో విభేదించి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిశారు. ఈక్రమంలో విప్‌ కాంతారావుతోనూ సఖ్యతగానే ఉన్నా అశ్వాపురం మండలం మల్లెలమడుగులో అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన దాడి, అశ్వాపురంలో జరిగిన దాడులతో రేగాతోనూ విబేధించారు.

సీపీఎస్‌ను రద్దు చేసే వరకు పోరాటం


నిరసన తెలుపుతున్న సీపీఎస్‌ఈయూ నాయకులు

పాల్వంచ: సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పెన్షన్‌ అందించే వరకు పోరాటం ఆగదని టీఎస్‌ సీపీఎస్‌ ఈయూ జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌ సెంటర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అంబేడ్కర్‌ ఇచ్చిన ఉద్యోగుల రాజ్యంగబద్ధ హక్కు అయిన పింఛన్‌ను ప్రభుత్వాలు ఏకపక్షంగా రద్దు చేయడం దారుణమన్నారు. 16న కొత్తగూడెంలో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌, సురేశ్‌, శ్రీనివాస్‌, రామకృష్ణ, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం సాగర్‌ కాల్వలో గురువారం జారిపడి గల్లంతైన ఏసయ్య(43) మృతదేహం లభించింది. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లలచెరువుకు చెందిన ఏసయ్య కుటుంబంతో సహ నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో చెరుకు నరికేందుకు వచ్చాడు. కాల్వ వద్దకు గురువారం వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి పడి గల్లంతుకాగా, ఖమ్మం రూరల్‌ మండలంలోని మద్దులపల్లి వద్ద శుక్రవారం మృతదేహం లభించింది.

ఏటీఎం కార్డు మార్చి నగదు దోపిడీ

భద్రాచలంఅర్బన్‌: ఏటీఎం మార్చి రూ.3 లక్షల వరకు నగదు కాజేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని ఎంపీకాలనీకి చెందిన నారాయణ ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఒక ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి వచ్చాడు. కానీ, ఆయనకు డబ్బులు డ్రా చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తిని సంప్రదించి డబ్బులు డ్రాచేయాలని అడిగాడు. ఇదే అదునుగా భావించి సదరు వ్యక్తి ఏటీఎం కార్డుకి సంబంధించిన అన్ని వివరాలను అడిగి తెలుసుకుని.. ఏటీఎం నుంచి డబ్బులు రావడం లేదని ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. కొన్ని రోజుల తరువాత నారాయణ స్థానిక ఎస్‌బీఐకి వెళ్లి తన ఖాతాలో ఉన్న డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా డబ్బులు లేవని బ్యాంక్‌ అధికారులు తెలిపారు. తన ఖాతాలో డబ్బులు డ్రా అయ్యాయని తెలపడంతో నారాయణ షాక్‌కు గురయ్యాడు. దుండగుడు సుమారుగా రూ.3 లక్షలు డ్రాచేసినట్లు తేలింది. జరిగిన మోసం తెలుసుకున్న నారాయణ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మధుప్రసాద్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న 108 సిబంది

దమ్మపేట: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గుర్వాయిగూడెం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పాల్వంచ మండలానికి చెందిన ఎనిమిది మంది కుటుంబ సమేతంగా కారులో అన్నవరం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం గుర్వాయిగూడెం గ్రామ సమీపంలో గల ఆలయం వద్ద కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులోని పోతురాజు అరుణ (35), కాతిరాజు రమణ (55) గాయపడ్డారు. ఎయిర్‌ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. క్షతగాత్రులకు 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు.

అడ్వాన్స్‌ నగదు విషయంలో ఘర్షణ

వ్యక్తిపై ముగ్గురి దాడి.. కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్‌: అడ్వాన్స్‌గా ఇచ్చిన నగదు విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని దాడికి దారి తీసింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామంలో రామినేని సురేశ్‌ అనే వ్యక్తికి చెందిన షాపును.. ఇదే గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ మెకానిక్‌ ఎస్‌.వెంకన్నబాబు ఏడాది కిందట రూ.80 వేలు అడ్వాన్స్‌గా చెల్లించి అద్దెకు తీసుకున్నాడు. కాగా, ఈ షాపును మూడు నెలల కిందట వెంకన్నబాబు ఖాళీ చేసి తనకు ఇవ్వాల్సిన అడ్వాన్స్‌ నగదు కోసం తిరుగుతున్నాడు. ఇదే విషయంపై గురువారం రాత్రి సురేశ్‌, వెకంన్నబాబు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. దీంతో సురేశ్‌తోపాటు అతడి అన్న మురళి, బావమరిది సంతోష్‌ కలిసి వెంకన్నబాబుపై దాడి చేశారు. ఈ ఘటనను స్థానికులు సెల్‌ఫోన్లో చిత్రీకరించి వాట్సాప్‌లో షేర్‌ చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో గాయపడిన వెంకన్నబాబు ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, వెంకన్నబాబు ఫిర్యాదు మేరకు సురేశ్‌, మురళి, సంతోష్‌పై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్‌ వెంకటేశ్వరరావు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఖమ్మంక్రైం: పట్టాలు దాడుతున్న వృద్ధుడిని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. ఖమ్మం సమీపాన కొత్తగూడెంకు చెందిన తోట నారాయణ(75) పనిపై శుక్రవారం ఖమ్మం వచ్చి వెంకటగిరి గేటు వద్ద పట్టాలు దాటుతున్నాడు. అదేసమయాన వస్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఆయన గమనించకపోగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్‌: ఖమ్మం రూరల్‌ మండలంలోని వరంగల్‌ క్రాస్‌రోడ్డుకు చెందిన వివాహిత జిల్లా పద్మ(26) భర్త వేధింపులు తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యాపేట జిల్లా మోతే మండలం ఉర్లుగొండకు చెందిన పద్మకు కూసుమంచి మండలం గైగోళ్లపల్లికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్‌ విజయ్‌కుమార్‌తో గత పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యను విజయ్‌కుమార్‌ అనుమానంతో వేధిస్తుండటంతో గైగోళ్లపల్లి నుండి వరంగల్‌ క్రాస్‌రోడ్డుకు మకాం మార్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో మనస్థాపం చెందిన పద్మ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పొలం గట్ల మధ్య వ్యక్తి మృతదేహం లభ్యం


గోపాల్‌ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇల్లెందురూరల్‌: మండలంలోని కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ అశోక్‌నగర్‌ గ్రామ సమీపంలోని పొలంగట్లలో శుక్రవారం ఈసం గోపాల్‌ (38) మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించారు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మామిడిగూడెం గ్రామపంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన గోపాల్‌ ఇంట్లో ఘర్షణ పడి మూడు రోజుల కిందట చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గాలింపు చేపట్టారు. శుక్రవారం పొలం గట్లలో యువకుడి మృతిదేహాన్ని గుర్తించిన స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజు, ఎస్‌ఐ రాజేశ్‌ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అక్కడే ఉన్న పలువురు రైతులు మృతుడు వెంకటాపురం గ్రామానికి చెందిన ఈసం గోపాల్‌గా అనుమానించారు. వెంటనే వాకబు చేసిన పోలీసులు మృతుడు ఈసం గోపాల్‌గా నిర్ధారించుకొని శవపరీక్ష నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గోపాల్‌కు భార్య లక్ష్మి, పాప, బాబు ఉన్నారు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే


కానిస్టేబుల్‌ నవీన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్‌

ఖమ్మం వైద్యవిభాగం: కారేపల్లి మండలం చీమలపాడు ఘటనలో గాయపడి ఖమ్మం సంకల్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఆర్‌ హెడ్‌కానిస్టేబుల్‌ నవీన్‌ను వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ శుక్రవారం పరామర్శించారు. ఈసందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన ఆయన, నవీన్‌ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే, నవీన్‌ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కారేపల్లి: మండలంలోని చీమలపాడు ఘటనలో మృతి చెందిన చీమలపాడు, స్టేషన్‌ చీమలపాడు, గేటురేలకాయపల్లికి చెందిన అజ్మీర మంగు, బానోతు రమేష్‌, ధరంసోత్‌ లక్ష్మా కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు రూ.50వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అలాగే, కాళ్లు కోల్పోయిన తవిసిబోడుకు చెందిన తేజావత్‌ భాస్కర్‌ కుటుంబానికి రూ.25వేల సాయం అందించారు. జెడ్పీటీసీ వాంకుడోతు జగన్‌, సర్పంచ్‌ భూక్యా రమణ, నాయకులు ఉన్నం వీరేందర్‌, హన్మకొండ రమేష్‌, ధరంసోత్‌ శంకర్‌, పాటి రాంబాబు, మూతి కోటేశ్వరరావు, బుడిగ ప్రభాకర్‌, భూక్యా చందూనాయక్‌, గౌసుద్దీన్‌, నరేన్‌, సాములు, జవ్వాజి శ్రీనివాసరావు, పేర్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త


మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

దమ్మపేట: మండలంలోని వడ్లగూడెం గ్రామంలో ఈ నెల 10వ తేదీన అనుమానాస్పద మృతిగా భావించిన మౌనిక (భర్తే చంపాడు) కేసును పోలీసులు ఛేదించి హత్య కేసుగా నమోదుచేశారు. సీఐ బాలకృష్ణ శుక్రవారం వివరాలు వెల్లడించారు. కల్లూరుకు చెందిన మౌనికకు వడ్లగూడెం గ్రామానికి చెందిన చల్లా నాగేంద్రబాబుకు 11 ఏళ్ల కిందట వివాహం జరుగగా, వారికి 10 ఏళ్ల పాప ఉంది. వారసుడు జన్మించలేదనే కారణంగా కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 10వ తేదీ రాత్రి వారి మధ్య గొడవ జరుగగా నాగేంద్రబాబు భార్యను కొట్టి, చీరతో ఉరి వేసి హత్యచేశాడు. హత్య అనంతరం ఆమెను కిందకు దింపి మంచం మీద పడుకోబెట్టి గుండెపోటుగా చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. అనంతరం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి.. నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారించగా అసలు వాస్తవం వెలుగుచూసిందని సీఐ వివరించారు. మౌనిక హత్య విషయం తెలిసి కూడా చెప్పకుండా దాచినందుకు.. నిందితుడి సోదరుడు చల్లా దిలీప్‌, తండ్రి చల్లా చెన్నారావును కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్‌తో పాటుగా స్టేషన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

మండే ఎండల్లోనూ... అందంగా... ఆరోగ్యంగా



ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖ చర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...

మంచి నీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటి నుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

● గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.

● నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

● ఉప్పు, కొద్దిగా మసాలాలు జోడించి పెరుగు చిలికి చేసే మజ్జిగ శరీరంలో వేడిని చల్లారుస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. ఇది ఎలక్ట్రోలైట్ల భరితం. వేసవి తాపంతో పోరాడటానికి మజ్జిగ ఒక మంచి ఆప్షన్. దీనిలో క్యాలరీలు తక్కువ. కాల్షియం, పొటాషియంతో పాటు ప్రొటీన్ కూడా దీని నుంచి దొరుకుతుంది. అసిడిటీని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా పెరుగు తీసుకోవడం కూడా మంచిదే.



● గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. ● కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.

చర్మ సంరక్షణ ముఖ్యం

● వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్ ని రాసుకోవడం వల్ల చర్మానికి సమస్యలు తగ్గుతాయి. ఈ సన్‌స్క్రీన్ లోషన్‌ని బయటికి వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా అప్లై చేసుకోండి. సన్‌స్క్రీన్ లోషన్ వాడటం వల్ల చర్మ సమస్యలు ఉండవు. అలాగే చర్మానికి రక్షణ ఉంటుంది.

● ఎండల్లో బయటకు వెళ్ళినప్పుడు చర్మాన్ని కవర్ చేసుకోవడం అవసరం. కాబట్టి మీరు బయటకు వెళ్లేటప్పుడు గొడుగుని తీసుకు వెళ్లడం మర్చిపోకండి. అలానే ఎండా కాలంలో బయటకు వెళ్ళేటప్పుడు సన్ గ్లాసెస్‌ని ధరించడం, తలకు పెద్ద టోపీ పెట్టుకోవడం పైగా ఎలాంటి సమస్యలూ రావు.

● వేసవిలో ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. ఇంటి వంటలలో కూడా నూనె వాడకం తగ్గించాలి. ● ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా కూరలు తగ్గించాలి. ● అల్పాహారంగా ఆవిరి కుడుములు, ఇడ్లీ వంటివి తీసుకుంటే మేలు. ● కర్బూజా, పుచ్చకాయలు, ఈత కాయలు, తాటి ముంజలు వంటి సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది. ● వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి. రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

మీకు తెలుసా?



రోజంతా చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవడం అవసరం. దీనిలో మొలకెత్తిన గింజలు, ఉడికించిన కోడిగుడ్లు, నూనె లేకుండా చేసిన చపాతీలు, పండ్ల రసాలే కాక... ఐదు నానబెట్టిన బాదం పప్పులు, పండ్లు, కూరగాయలతో కలగలిపిన సలాడ్ లు వంటివి తీసుకుంటుంటే అనారోగ్యాన్ని కలిగించే వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు దరిచేరవు. వీటితోపాటు.. తీసుకునే అల్పాహారంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే డైటింగ్ చేసే వారు నిర్లక్ష్యం చేయకుండా.. అల్పాహారం తీసుకోవడం మరువకూడదు.

నీళ్లు ఏ బాటిల్‌లో తాగుతున్నారు..?

అసలే ఎండాకాలం.. దాహం వేస్తుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడంటే కావలసినప్పుడల్లా నీళ్లు తాగుతుంటాం. మరి బయటికి వెళ్లేటప్పుడు? అందులో ఆలోచించేదేముంది... ఒక వాటర్ బాటిల్ తీసుకెళతాం.. అంతే కదా అని సింపుల్‌గా చెప్పేస్తాం. అయితే ఆ బాటిల్ దేనితో తయారు చేసింది... అంటే నూటికి తొంభై పాళ్లు 'ప్లాస్టిక్ బాటిల్' అనే సమాధానం వస్తుంది. దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం వల్ల ఎంత ఉపయోగమో, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్లు తాగడం అంత ప్రమాదం. అది ఎండాకాలం అయితే కనక ఈ ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఏమిటా నష్టాలు అంటారా? అదే చూద్దాం..

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని పదే పదే చెబుతున్నా కూడా ప్లాస్టిక్ ఇంకా వాడకంలోనే ఉండటానికి కారణం ఏమిటంటే, దానిని క్యారీ చేయడం చాలా సులువు. నిర్వహించడం ఇంకా సులువు. ఒకవేళ ఎక్కడైనా పెట్టి మరచిపోయినా పెద్ద ఖరీదు ఉండదు కాబట్టి దిగులు పడనక్కరలేదు. అందువల్ల పర్యావరణ ప్రేమికులు ఎంతగా నెత్తీ నోరు బాదుకుంటున్నా, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విషయంలో వెనకబడవలసి వస్తోంది.

● ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అయినా, భారీ ప్లాస్టిక్ కంటైనర్లు అయినా వాటి నుంచి నీరు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా ఉంచిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీటిని అసలు తాగకూడదు. ● పరిశోధన ప్రకారం.. ప్లాస్టిక్ బాటిల్స్ మీద ఎండ పడితే.. అవి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మనం ఈ నీటిని తాగితే.. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడే.. ఎండోక్రైన్ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. ఇలాంటి నీటిని ఎక్కువగా తీసుకుంటే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయాన్ని కూడా పాడు చేస్తుంది.



● ఎండలో ఉండే.. ప్లాస్టిక్ బాటిల్ నుంచి దయాక్సిన్ లాంటి టాక్సిన్ నీటిలోకి విడుదల అవుతుంది. ఈ దయాక్సిన్ నీటిని తాగితే.. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్ల తాగితే.. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. మగవారిలో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గవచ్చు. బాటిల్ వాటర్‌లో మైక్రో ప్లాస్టిక్స్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

● మైక్రోప్లాస్టిక్స్ కలిసిన నీటిని తాగితే పొత్తి కడుపునకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ల అసమతుల్యం, పీసీఓఎస్, ఒవేరియన్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు రావొచ్చు.

● ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది కాదు. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు ఎండ తగిలితే.. అస్సలే తాగొద్దు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లను కొంతమంది అలానే ఉపయోగిస్తారు. ఇంటికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటారు. ఇది ఇంకా అపాయకరమైనది. ఇలా అస్సలు చేయొద్దు ఎప్పుడూ.

ఏం చేయాలి మరి?

ప్లాస్టిక్ బాటిల్స్ అంతగా వాడుకలోకి రాని రోజుల్లో పెద్దవాళ్లు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు స్టీలు లేదా ఇత్తడి మరచెంబులు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు కూడా అదే మంచిది. అందుకు తగ్గట్టు ఇప్పుడు మార్కెట్‌లో రకరకాల సైజుల్లో, ఆకారాలలో రాగి, స్టీలు, ఇత్తడి బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాస్తంత ఖరీదు ఎక్కువైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలతో పోల్చుకుంటే ఫరవాలేదనిపిస్తుంది.

● ప్లాంట్ బేస్డ్ బాటిల్స్, గాజుసీసాలు, అల్యూమినియం వాటర్ క్యాన్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మనం వాడకం మొదలు పెడితే ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి.

గ్యాస్ ఆదా చేద్దామా?

ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు వంటకు గ్యాసే వాడుతున్నారు. దాంతో వంట గ్యాస్ ధర రోజురోజుకీ పెరిగి మంట గ్యాస్‌గా మారిపోతోంది. అందుకే దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఎక్కువకాలం పాటు గ్యాస్ వచ్చే విధంగా చూసుకోవచ్చు. గ్యాస్ ఆదాకు చిట్కాలు తెలుసుకుందాం...



వంట చేసేటప్పుడు రోజులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో కూర వండుకోవడం మంచిది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి, రాత్రి ఒకసారి... ఇలా వండడం వల్ల గ్యాస్ ఎక్కువ మొత్తంలో పోతుంది. అదే మధ్యాహ్న భోజనం చేయడానికి ఒక గంట ముందు వండుకుంటే, అదే కూర మధ్యాహ్నానికి, రాత్రికి కూడా వస్తుంది. దీనివల్ల రెండు మూడుసార్లు గ్యాస్‌ను వాడాల్సిన అవసరం రాదు.

● **ప్రెషర్ కుకర్ బెస్ట్:** ప్రెషర్ కుకర్ అధిక పీడనం కింద ఆవిరి మీద ఆహారాన్ని ఉడికిస్తుంది పైగా రెండు మూడు రకాలను ఒకేసారి కుకర్‌లో పెట్టవచ్చు కాబట్టి తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది. గ్యాస్ కూడా ఆదా అవుతుంది.

● చిన్నగిన్నెలో వంటలు చేస్తున్నప్పుడు పెద్ద బర్నర్ వాడకూడదు. అలా వాడటం వల్ల మంట చాలా మటుకు బయటికి పోతుంది. దాంతో ఆ మేరకు గ్యాస్ వృథా అయినట్లే కదా.. అందువల్ల సాధ్యమైనంత వరకు చిన్న బర్నర్‌నే వాడటం మంచిది.

● బర్నర్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అది త్వరగా వేడెక్కి వంట త్వరగా పూర్తయ్యేలా చేస్తుంది.

● వంట పూర్తవడానికి కొంచెం ముందే స్టవ్ ఆపివేయండి. గిన్నె మీద మూత మాత్రం తీయవద్దు. లోపల ఉన్న వేడి ఆ మిగతా వంటను పూర్తి చేస్తుంది. దీనివల్ల గ్యాస్ ఆదా అవుతుంది.

● వంట చేస్తున్నప్పుడు గిన్నె మీద మూత పెట్టే ఉంచండి. ఎందుకంటే మూత పెట్టడం వల్ల లోపల ఉన్న వేడి బయటికి పోదు. ఆ వేడి మీదే త్వరగా ఉడుకుతుంది. అదేవిధంగా స్నానానికి వేడినీళ్లను గ్యాస్ మీద పెట్టవద్దు. నీళ్ల వేడెక్కడానికి చాలా సమయం పడుతుంది. దాంతో ఎక్కువ గ్యాస్ వాడాల్సి వస్తుంది.

● పగటిపూట వంట చేస్తున్నప్పుడు వంటగదిలోని లైట్లను ఆన్ చేయవద్దు. దీనివల్ల శక్తి ఆదా అవుతుంది. అలాగే మీకు తెలియకుండానే గ్యాస్ వినియోగం కూడా తగ్గుతుంది. ఈ చిట్కాలన్నీ పాటించడం వల్ల గ్యాస్ సిలెండర్ దాదాపు పది రోజులు అదనంగా వచ్చే అవకాశం ఉంది.

సినిమా

కేరాఫ్ ఫారిన్

సమ్మర్‌లో కూల్‌గా ఉండే లొకేషన్స్‌ని ఎంచుకుని, వెకేషన్‌కి వెళుతుంటారు కొందరు స్టార్స్. కొందరిని షూటింగే చల్లని ప్రాంతాలకు తీసుకెళుతుంది. అలా 'కేరాఫ్ ఫారిన్' అంటూ షూటింగ్స్‌కి, వెకేషన్‌కి విదేశాలు వెళ్లిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.


● కమల్‌హాసన్


● ప్రభాస్



● అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్

● రెండు వారాలుగా ఫారిన్‌లోనే ఉంటున్నారు ఇండియన్. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌతాఫ్రికాలో జరుగుతోంది. కమల్‌పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు శంకర్. ఈ వారం కూడా 'ఇండియన్ 2' టీమ్ సౌతాఫ్రికాలోనే ఉంటుందని తెలిసింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు.

● ఇటలీలో ఫైట్స్ చేశారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'సలార్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ గత నెలలో ఇటలీ లొకేషన్స్‌లో జరిగింది. ముఖ్యంగా ప్రభాస్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'సలార్' సినిమా యూనిట్ మరోసారి ఫారిన్ వెళ్లనుందని సమాచారం. బుడాపెస్ట్ లొకేషన్స్‌లో 'సలార్' షూటింగ్‌ను ప్లాన్ చేశారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణలో ప్రభాస్ పాల్గొంటున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి కాగానే 'సలార్' కోసం ప్రభాస్ ఫారిన్ ఫ్లైట్ ఎక్కుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

● లండన్‌లో ప్రేమ పాఠాలు నేర్చుకుంటున్నారు శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల లండన్‌లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. గత వారం శర్వానంద్, కృతీపై కీలక సన్నివేశాలు, ఓ పాట చిత్రీకరించారు.


● రణ్‌బీర్ కపూర్


● శర్వానంద్

● బాలీవుడ్ 'బడే మియా చోటే మియా' లండన్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బడే మియా చోటే మియా'. ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. అట్నుంచి అటు లండన్ వెళ్లారు. మరో పది రోజులపాటు లండన్ షెడ్యూల్ జరుగుతుందట. అలాగే మరో బాలీవుడ్ మూవీ 'యానిమల్' షూటింగ్ కూడా లండన్‌లో జరిగింది. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాలు ఫారిన్ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను ప్లాన్ చేశాయి.

సమ్మర్ బ్రేక్


● మహేశ్‌బాబు


● రామ్‌చరణ్


● ఎన్టీఆర్

షూటింగ్స్‌కు సమ్మర్ బ్రేక్ ఇచ్చారు కొందరు స్టార్ హీరోలు. ప్రతి ఏడాది సమ్మర్‌కు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లే మహేశ్‌బాబు ఈ ఏడాది కూడా ఫారిన్ టూర్ వెళ్లారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో వెకేషన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. మహేశ్ ఫ్యామిలీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫారిన్ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు మహేశ్‌బాబు. మరోవైపు 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్ గోవాలో ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ నుంచి ఎన్టీఆర్ స్మాల్ బ్రేక్ తీసుకున్నారని తెలిసింది. గోవా షెడ్యూల్‌లో వచ్చే నెల జాయిన్ అవుతారట ఎన్టీఆర్. ఇక రామ్‌చరణ్ ఫుల్ వెకేషన్ మోడ్‌లో ఉన్నారు. ఇటీవల రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన దుబాయ్ వెళ్లొచ్చారు. ప్రస్తుతం ఈ దంపతులు మాల్దీవుల్లో ఉన్నారు. ఈ వెకేషన్‌ను పూర్తి చేసిన తర్వాత రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో పాల్గొంటారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

నేను సింగిల్


● పూజా హెగ్డే


'ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే నాకు ఇష్టం' అంటున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌కి జోడీగా నటించారు పూజా హెగ్డే. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి సల్మాన్, పూజా హెగ్డే డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పైగా మంగళూరులో జరిగిన పూజ సోదరుడు రిషబ్ హెగ్డే వివాహానికి సల్మాన్ ఖాన్ హాజరవడం డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ వార్తలపై తాజాగా పూజా హెగ్డే స్పందిస్తూ– ''నా గురించి ఎన్నో వార్తలు వస్తుంటాయి. వాటిల్లో సల్మాన్‌గారితో డేటింగ్ అనేది ఒకటి. ఇలాంటి వార్తల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే ఇష్టం. ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే ఉంది. వేర్వేరు భాషల్లో ఎక్కువ సినిమాల్లో నటించాలన్నదే నా లక్ష్యం. సల్మాన్‌గారితో నటించడం గొప్ప అనుభూతి'' అన్నారు.

భావోద్వేగాల విమానం


● ధ్రువన్, సముద్ర ఖని

నటుడు, దర్శకుడు సముద్ర ఖని లీడ్ రోల్‌లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విమానం'. మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని జూన్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ ప్రోమోను విడుదల చేశారు. జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ క్రేజీవాల్ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'విమానం'. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా, భార్య లేకపోయినా తనయుణ్ణి జాగ్రత్తగా చూసుకునే తండ్రి వీరయ్యగా సముద్రఖని అద్భుతంగా చేశారు. బలమైన కథాంశంతో చక్కని భావోద్వేగాలతో ఈ చిత్రం ఉంటుంది. కిరణ్ కొర్రపాటితో అసోసియేట్ కావటం హ్యాపీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు, సంగీతం: చరణ్ అర్జున్.

ఆ సమయంలో రాకీ భాయ్ ఎక్కడ?


● యశ్

హీరో యశ్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'కేజీఎఫ్' తొలి, మలి భాగాలకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' విడుదలై శుక్రవారం (ఏప్రిల్ 14)తో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'కేజీఎఫ్ 2'షార్ట్ వీడియోను ఈ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ షేర్ చేసింది. '1978 నుంచి 1981వ రకు రాకీ భాయ్ ఎక్కడ?, ఆ ప్రామిస్ నిలబడిందా?' అనేవి ఈ వీడియోలో కనిపించాయి. అలాగే '3'తో ఈ వీడియో పూర్తవుతుంది. దీంతో 'కేజీఎఫ్ 3' ఉంటుందని స్పష్టమవుతోంది.


● గుల్షన్ దేవయ్య, గుల్జార్, రాజ్ రాచకొండ

ఇద్దరు అపరిచితుల కథ

గుల్షన్ దేవయ్య, సయామీ ఖేర్ జంటగా 'మల్లేశం' చిత్రం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన చిత్రం '8 ఏఎమ్ మెట్రో'. శిలాదిత్య బోరా ప్లాటూన్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా మే 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రముఖ గేయ రచయిత, దర్శకుడు గుల్జార్ ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ చదివినప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. అందుకే నా కవితలు అందించాను'' అన్నారు. ''మెట్రో ట్రైన్‌లో కలుసుకుని, ఒకరినొకరు తెలుసుకునే ఇద్దరు అపరిచితుల కథే ఈ సినిమా'' అన్నారు రాజ్ రాచకొండ. ''ఈ చిత్రంలో నా పాత్రకి ఒక సీక్రెట్ ఉంది. అది ఇద్దర్నీ వేరు చేయడంతో పాటు నమ్మకాల్ని కూడా చీల్చుతుంది'' అన్నారు గుల్షన్.

ప్రచండ తరుణం షురూ


● రితికా, అశోక్, శ్రష్టి

అశోక్ రాజ్, రితికా రాజ్, శ్రష్టి వర్మ, వినయ్ బిడప్ప, ఉగ్రం మంజు, రవితేజ ప్రధాన పాత్రల్లో 'ప్రచండ తరుణం కాఠిన్య కావ్యం' అనే సినిమా షురూ అయింది. బాల పులిబోయిన దర్శకత్వంలో పులిచర్ల నాగరాజు, రామచంద్ర, కొల్లకుంట నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రొడక్షన్ హెడ్ రాజ్యలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, కన్నడ హీరో సిద్ధార్థ్ మహేశ్ క్లాప్ కొట్టారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్‌ని అందించారు. ''మన పురాణాలు, ఇతిహాసాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో బ్యాలెన్స్ చేసి తయారు చేసిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు దర్శక-నిర్మాతలు.